


"ఛీ . . . వదలండి . . ."

పార్వతిగొంతులోని కాఠిన్యానికి చలపతి ఆశ్చర్యంతో భార్యముఖంలోకి చూశాడు. ఆమె ముఖంలో కొట్ట వచ్చినట్లు కానవస్తున్న చీత్కారానికి, అసహ్యానికి, విసుగుదలకు ఆశ్చర్యం వేసింది.

అప్పటికి పెండ్లి అయి ఎనిమిది సంవత్సరాలయింది. ఇద్దరు పిల్లలు పుట్టారు. కాని ఇప్పటికీ అప్పుడే స్నానం చేసివచ్చిన పార్వతిని చూస్తే చలపతి ఉద్రేకం ఆపుకోలేడు. ముడిచిన వెంట్రుకలనుండి పైన పడుతూన్న నీటిబొట్లు, అలంకారం లేకుండా సహజ సౌందర్యం వెదజల్లే ముఖము, ఆ బంగారు భుజాలను తనివి చేసుకొని, ఆ వెచ్చనిశరీరం విరజిమ్మే మైసూరు శాండిల్‌సబ్బు పరిమళాన్ని ఆఘ్రాణించటం చలపతికి ఎంతో ఇష్టం. ప్రతిసారీ వద్దని పార్వతివారించినా, పక్కనికి, అతని క్రొప్పువెంట్రుకలలోనికి ఆమె తన సన్నని వ్రేళ్ళను పోనిచ్చి, ప్రేమతో అతణ్ణి లాలించటం అలవాటు. కానీ ఈ రోజు అంతా తారుమారయింది. భార్య చేతివేళ్ల చక్కిలిగింతలు ఆశించిన చలపతిని భార్య చీత్కారం చలనరహితుణ్ణి చేసింది. అతనిలోని ఉత్సాహం అంతా చల్లారిపోయింది. మెల్లిగా ఆమెను వదిలి, సూటిగా ఆమె కళ్లలోకి చూస్తూ "ఏం పార్వతీ?" అన్నాడు.

అతని చూపులనుండి తప్పించుకుంటూ "ఇంకా చిన్నవారమేనాండీ?" అన్నది పార్వతి. కాని ఆ మాటలు నిజంగా తోచలేదు. ఇలా మాటలు దాటించి వేయటం పార్వతికి క్రొత్త.

"నిజం చెప్పు పార్వతీ!" అన్నాడు.

"నా కిలాంటివి ఇష్టంలేదు. ." పార్వతి లోనికి విసురుగా వెళ్ళిపోయింది. ఆశ్చర్యంతో, చల్లారిపోయి మెలిదిరిగిన మనస్సుతో చలపతి కుర్చీలో కూలబడి పోయాడు. భార్య ఎందుకిలా మారిపోయిందో అతనికి అర్థం కావటం లేదు. స్వల్పకాలంలోనే ఇంత మార్పా?

పార్వతిని పెళ్ళిచూపులకు వెళ్లి చూచినవాడే, చలపతి ఆ అపూర్వసౌందర్యానికి ముగ్ధుడయి గాఢంగా ప్రేమించాడు. ఆమెతండ్రి స్థితిపరుడు కాదు. కట్నాలు ఇచ్చుకోలేడు. చలపతిభాగ్యవంతుడు కాకపోయినా చదువుకున్నాడు. చేసేది గుమాస్తాఉద్యోగమే అయినా చేసుకున్నదాన్ని పోషించగలడు. అందుకనే ఆమెను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆమెకూడా అతణ్ణే ప్రేమించింది. ఇంతవరకూ సాఫీగా, ఆనందంగా జరిగిపోయింది వారి దాంపత్యజీవితం. . . . . . . . ఒకరి కలలు మరొకరికి చెప్పుకున్నారు. ఆమె ఆనందంకోసం సర్వం అర్పించ గలడు. అందుకనే, ఆమెకు స్వగృహం అంటే ఎంతో ఇష్టం అని గ్రహించి, అప్పుచేసి, చిన్నదేఅయినా పక్కని ఇల్లు కట్టించాడు. నూతనగృహప్రవేశం

తీసుకోటానికి పార్వతి సుతరామూ ఒప్పుకోలేదు. రమేశం నవ్వుతూ "మీ ఇద్దరాన్ని అభిమానంపై పెలలో కొన్నా కట్టలేను. . . మీకు ఇది చాలా స్వల్పం" అన్నాడు. పార్వతి తనవైపు దీనంగా చూచింది. చలపతినవ్వుతూ "తీసుకో పార్వతీ! . . పర్వాలేదు. మన రమేశమే కదూ!" అన్నాడు. పార్వతి దాన్ని తీసుకొని నిర్లక్ష్యంగా బీరువాలో పడవేసిందే కాని పెట్టుకోలేదు. ఎందుకో రమేశంమీద పార్వతికి అంత కోపం అనుకున్నాడు.

ఎన్నివిధాల ఆలోచించినా పార్వతిలో ఈ మార్పు ఎందుకువచ్చిందో చలపతికి అర్థంకాలేదు. ఆమె ప్రవర్తన, ఆమెమీద తన ప్రేమ తలంచుకొనేకొలది చలపతిలో ఉక్రోషం, కోపం, నిర్లిప్తత పోయి విచారం కలగసాగింది. తాను ఏ పరిస్థితులలోను పార్వతిని వదిలిపెట్టి బ్రతకలేడు. కాని పార్వతి హృదయం మార్చగలడా? . . కారణం తెలిస్తేగా భార్యమనస్సు మార్చగలిగేది?

ఏలాగయినా ఆమెచేత నిజం చెప్పించి, అపార్థాలను అనుమానాలను తొలగించివేయాలి అనే నిర్ణయానికి వచ్చి చలపతి ఇంటికి బయలుదేరాడు. అంతవరకు ఎంత పొద్దుపోయిందో గమనించేస్థితిలో లేడు చలపతి.

## 3

చలపతికి పార్వతి అర్థంకావటంలేదు.

చలపతి తిరిగివచ్చేవరకు ఇల్లు చాలా ప్రశాంతంగా ఉంది. పిల్లలిద్దరూ నిద్ర పోతున్నారు. ఏమి జరగనట్లే ప్రవర్తించింది పార్వతి. నల్లని అంచు తెల్లనిగ్లాస్కో ఇస్త్రీచీర, తెల్లని చికిన్‌వాయిలురవిక తొడిగింది. వంకీలు తిరిగిన కురులతో మల్లెలు నవ్వుతున్నాయి. అంతవరకూ బీరువాలోఉన్న రమేశంఇచ్చిన రాళ్లనెక్లేసు ఆమెమెళ్లో మెరుస్తూంది. ఎన్నో అడగాలని ఇంటికి వచ్చిన చలపతి ప్రశాంతతను భగ్నపరచలేక మౌనంగా ఉండిపోయాడు.

"చాలా పొద్దుపోయింది ... భోజనానికి రండి" పార్వతి మామూలుగా పిలిచింది. చలపతి మౌనంగా పోయి భోజనం వద్ద కూర్చున్నాడు. భోజనం జరిగినంతసేపు ఇద్దరు మాట్లాడలేదు. కాని భోజనం యథాప్రకారంగా చాలా రుచికరంగా ఉంది.

చలపతి రేడియోవద్ద కూర్చుని నోట్లో వక్కపొడి వేసుకుంటూంటే పార్వతి వచ్చి "రమేశంగారు రేపు వారితోటకు పిక్‌నిక్‌కు పోదమని అని చాలా బలవంతం చేశారు. నేను రానని చెప్పాను" అని నిర్లిప్తంగా అనింది.

చలపతికి కోపం వచ్చింది. "ఆ పెద్దమనిషి మనకోసం ఇంతచేస్తున్నాడు. ... పెలవురోజు పిక్‌నిక్‌కు పోతేనేం?" అన్నాడు.

పార్వతిముఖంలోని నిర్లిప్తత మాయమయింది. కోపం చికాకు వచ్చాయి. "చెబితే మీరు అర్థం చేసుకోరు. . . నేను రాను" అనింది.

ఆమె మొండితనం చూచిన చలపతికి కోపం రెచ్చిపోయింది. భార్య ఎందుకు అర్థం చేసుకోదా అనుకున్నాడు. "పోయితీరవలసిందే" అని కఠినంగా అన్నాడు.

పార్వతిముఖం అసహ్యంతో నిండిపోయింది. "మీ . . . వారు! . ." అని గిర్రున వెనక్కి తిరిగింది.

చలపతికి ఆమె తన మొగతనాన్ని సవాల్ చేసినట్లయింది. వెంటనే భార్య చెయ్యి గట్టిగా పట్టుకొని మెలితిప్పాడు.

"నిజం చెప్పు. ... నేనంటే ఎందుకు ప్రేమ లేదు? . . నన్ను ఎందుకు అసహ్యించుకుంటున్నావు?" చలపతి అడిగాడు.

పార్వతికి బాధగా ఉంది. కాని ఆమెముఖంలో బాధకుబదులు అసహ్యం గోచరించింది. ఒక్కక్షణం భర్త ముఖంలోకి తీక్ష్ణంగా చూచి, "మీరు నిజం విని సహించలేరు. . . . వదలండి నన్ను. ." అని చేయి విదిలించుకుంది.

"పార్వతీ! . . . నిన్ను ప్రేమించకుండా ఉండలేను. నిజం చెప్పు. నన్ను ఎందుకు ప్రేమించటం మానుకున్నావు?" చలపతి ముఖం దీనంగా ఉంది.

"ప్రేమట! ... ఛ ... ప్రేమ!" పార్వతి చీత్కారం చేసింది.

"నా ప్రేమను నమ్మలేవా పార్వతీ! . . నీ కోసం ఎన్ని త్యాగాలు చెయ్యలేదు!" అతనికి తెలియకుండానే చలపతి కన్నుల్లో నీళ్లు నిండాయి. చికాకుతో జుట్టు పీక్కోసాగాడు.

ఆమెకు జాలి కలగడానికి బదులు మరీ అసహ్యం వేసింది. "కన్నీళ్లతో జాలి కలగవచ్చును. కాని పోయిన ప్రేమ రాదండి. . ." గబాలున గదిలోనికిపోయి తలుపులు బిడాయించుకుంది.

"నన్ను చంపక నిజం చెప్పు పార్వతీ!" దీనంగా అరుస్తూ బాధతో చలపతి మంచంమీద వాలిపోయాడు.

## 4

రమేశం కారుహారన్‌మోతతో చలపతికి మెలకువ వచ్చేవరకు ఉదయం ఎనిమిది గంటలయింది. రాత్రి అంతా విడదీయనలవికాని పార్వతిసమస్యను అర్థం చేసుకోటానికి విఫలప్రయత్నం చేశాడు. అలిసి, సొమ్మసిలి నిద్ర పట్టేవరకు తెల్లవారిపోతూంది.

మొండికెత్తిన పార్వతిని ఎలా మార్చాలా? అని చలపతి బద్ధకంగా లేచి ముఖం కడుక్కొని తయారయ్యే వరకు కారులో పిక్‌నిక్‌కు కావలసిన సామానంతా సర్ది ఉన్నారు. "ఎప్పుడూ ఆలస్యమే కదా?" రమేశం పరిహాసం చేశాడు. చలపతి గబగబా స్నానంచేసి బట్టలు మార్చుకుని వచ్చేవరకు పిల్లలిద్దరు వెనకసీట్లో కూర్చుని ఉన్నారు. ముందుసీట్లో చక్కగా అలంకరించుకున్న పార్వతి కూర్చొని ఉంది. రాత్రి విదిలించి తిరస్కరించి కొట్టిన పార్వతి ఈమేనా అనిపించింది. తలుపులు తాళాలు వేసి వచ్చిన చలపతిని వెనకసీట్లో పిల్లలవద్ద కూర్చోమని రమేశం ముందుగా పార్వతిపక్కన స్టీరింగు వద్ద కూర్చున్నాడు. చలపతిమనస్సు చివుక్కుమనింది.

ఎండాకాలంవానలా మారుతూంది పార్వతి ప్రవర్తన. ఆమె ఎప్పుడు ఏమిచేస్తుందో చెప్పటానికి వీలు కాకుండా ఉంది. అన్ని సంవత్సరాలు గంగాప్రవాహంలా, మెల్లిగా, నిదానంగా, నిర్మలంగా ప్రవహించిన ఆమె జీవితంలో ఏదో మార్పు వచ్చింది. అది ఎందుకు ఎలా వచ్చిందో అతనికి అర్థం కావటంలేదు. ఆమె చెప్పటం లేదు. అంతవరకు రమేశంఅంటే అయిష్టం చూపించేది. చివరకు భోజనం పెట్టటానికికూడా తిరస్కరించింది. బహుమానంగా ఇచ్చిన రాళ్లనెక్లేసు నిర్లక్ష్యం చేసింది. చివరకు రాత్రిపిక్‌నిక్‌కు రానని మొండిపట్టు పట్టితే చలపతి ఆమెను ప్రోత్సహించి బతిమాలవలసి వచ్చింది. అలాంటి పార్వతి, తెల్లవారేసరికి ఏమి వచ్చిందో పూర్తిగా మారిపోయింది. అందాలు విరజిమ్ముతూ, కొంటెచూపులు విసరుతూ, భర్త ఉనికినే మరిచిపోయినట్లు ముందుసీట్లో పరాయి మగవానితో కూర్చొని అతనితో హాయిగా ఛలోక్తులు విసరుతూంది. వెనకసీట్లో పిల్లలను పెట్టుకొని ఆయాలాఉండిపోయాడతను. ఎన్నడూలేనిది ఈ రోజు చలపతి హృదయం ఈర్ష్యాక్రోధాలతో నిండి రెచ్చిపోతూంది. రమేశం అప్పుడప్పుడూ వెనుదిరిగి తనను పలకరించటానికి ప్రయత్నిస్తున్నాడు కాని పార్వతి ఇటు తిరిగి చూడనేలేదు. 'అబ్బ! స్త్రీహృదయం!' అనుకుని నిట్టూర్చాడు.

కృష్ణానది వెంట పది మైళ్ళు పోయి తోటలోనికి తిరిగింది కారు. తోటలో నానారకాల ఫలవృక్షాలు పుష్పలతలు విరివిగా ఉన్నాయి. భావిలో నీటిని మోటతోలుతున్నారు. కారు ఆగగానే ఇద్దరుమనుష్యులు పరిగెత్తుకుంటూ వచ్చి సామాను అందుకున్నారు. పనిమనిషి ఫ్లాస్కును, చంటివాణ్ణి అందుకుంది. తోటలో ఒక పక్క చక్కని ఇల్లు ఉంది. అంతవరకు రమేశానికి అలాంటి తోట ఉన్న విషయమే చలపతికి తెలియలేదు.

కారు ఆగగానే, పార్వతి పిట్టలా రివ్వున తోటఅంతా కలయదిరుగుతూ విహరించసాగింది. ఇంకోపరిస్థితుల్లో అయితే చలపతికూడ ఎంతో ఆనందించి ఉండేవాడు. ఇప్పుడు అతని హృదయం, ఈర్ష్యావమానాలతో అనుమానంతో, ఉక్రోషంతో దహించుకుపోతూంది. ఒక చెట్టుకింద పాపను కూర్చోబెట్టి తను చేరగిలబడినాడు. ఆలా రెండు కాళ్ళమధ్య తల పెట్టుకొని, కుంగి, కృశించి




పోటూ ఎంతసేపు ఉన్నాడో తెలీదు. అనుకున్నట్టిలా ఈ పై జాలి కలుస్తూ, పార్వతిపై లేని అసహ్యాన్ని వ్యక్తీకరించుకుంటూ ఉండిపోయాడు. కాని చేజారిపోతున్న అమూల్యవస్తువును దక్కించుకోటానికి అతనిలో కవ్వింపుగాని, ఉద్రేకంగాని కలగటం లేదు.

ఈ లోకంలోకి వచ్చి కన్నులు తెరిచిచూసేవరకు చుట్టూ ఎవ్వరూ లేరు. తోట అంతా ప్రశాంతంగా ఉంది. సూర్యుడు నడినెత్తిమీద ఉన్నాడు. మోట ఆగిపోయి, మనుష్యులు, ఎద్దులతోబాటు చెట్లనీడలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆకలిగా ఉంది. మెల్లిగా లేచి కుటీరంవైపు బైలుదేరాడు.

కుటీరం వద్ద చెట్టుక్రింద వంటవాడు నిద్ర పోతున్నాడు. పాప దాసీదానితో ఆడుకుంటూంది. చలపతిలోనికి పోబోతే "అమ్మగారూ అయ్యగారూ లోపల సరదాగా ఉన్నారు. నీ వెందుకయ్యా మధ్య!" అని నవ్వింది దాసీ. ఎవ్వరో కొరడాతో వీపున ఛళ్ళున కొట్టినట్లయింది. అంతవరకూ అతనిలో ఉన్న నిర్లిప్తత తనపై జాలి పోయి, ఉద్రేకంతో, కోపంతో నిండి పోయింది మనస్సు.

"ఇదా నాటకం!" అని పళ్ళు పటపటా కొరుకుతూ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ ఊగుతూ బయలు దేరాడు చలపతి. అంత ఉద్రేకంలోను అంతవరకూ పార్వతి రమేశంమీద కనపరచిన విముఖతతో అనిష్టతతో అతనిముఖంలోకి తేరిపారచూస్తూంది. 'మీరూ మగవారే!' అని పార్వతి కవ్వింపు సూదుల్లా పొడుస్తూంది.

రమేశం మాటలు వినవచ్చి లోనికిపోబోతూ ఒక్క క్షణం ఆగిపోయాడు. "మైడియర్ పారూ. . . నీ కృప సంపాదించటానికి ఈ రోజువరకు ఎంత దీర్ఘతపస్సు చెయ్యవలసి వచ్చింది! ఇకనైన నా కోర్కె తీర్చవూ?" అంటున్నాడు.

చలపతి ఆశ్చర్యంతో తలఎత్తి చూసేవరకు పార్వతి రమేశం బాహుబంధంలో ఉంది. రమేశం ఆమె భుజం మీద ముద్దు పెట్టుకోబోతున్నాడు. వదిలించుకోవ టానికి పార్వతి గట్టిప్రయత్నం చెయ్యటంలేదు.

"వదలండి. . . వారు రావచ్చును!" పార్వతి అంది.

రమేశం వికృతంగా నవ్వాడు. "వాడా? . . . వస్తే ఏం? ఇంతడబ్బు ఊరికనే ఇస్తున్ననుకున్నావా? వాడి ప్రోత్సాహం లేకుంటే ఇంతటి విహారమే!"

పార్వతిముఖంలో నవ్వు మాయమయి అసహ్యం విచారం గూడుకట్టుకున్నాయి. "అదే నా బాధ! వారు ఎంత దిగజారిపోయారు! . . . అందుకే నా ప్రేమ అంతా అసహ్యంగా మారింది ..." అంది.

చలపతికన్నులు ఎవ్వరో బలవంతాన తెరిచినట్లయింది. 'ఇదా నిగూఢసత్యం!. . . ఎంత నాటకమాడాడు! అమాయికురాలు ఎంత అపార్థం చేసుకుంది!'

ఆలోచనలతో చలపతి కదలలేకపోయాడు. కాని మరు క్షణంలో అతని రక్తం వేడెక్కింది. ఉద్రేకం కట్టలు తెంచుకుంది. కోపంతో పిచ్చివాడయ్యాడు. మూలన ఉన్న కర్ర తీసుకొని "యూ రాస్కెల్!" అంటూ రమేశంపై దూకాడు! అతని మాటలకు రమేశం ఒక్క క్షణం కదలలేకపోయాడు. మరుక్షణంలో చలపతి భీకరస్వరూపంతో చేతిలోని కర్రనుచూచి పరుగు లంకించుకున్నాడు. చలపతి అతణ్ణి రోడ్డువరకు తరిమినా దొరకలేదు. చలపతి నిస్పృహతో రొప్పుతూ తిరిగివచ్చాడు.

పార్వతి నిలుచున్నచోటనే ఉంది. ఆమెలో ఏలాటి చలనం లేదు. భర్తకు ఎదురుగా రాలేదు. కాని అంతవరకూ ఆమెలో ఉన్న అసహ్యం, నిర్లక్ష్యం పోయి ఎంతో ప్రశాంతంగా ఉంది. ఒక్కసారి భర్తముఖంలోకి చూచి కన్నులు దించేసుకుంది. ఆ కన్నుల్లో మరల జ్యోతి వెలుగుతూంది.

"ఎన్ని రోజులకు మీలో కోపం రప్పించకలిగాను! ఎంత పొరబడ్డాను! . . . మీ నిర్మలహృదయానికి ఆత్మాభిమానం లేదని శంకించాను ... చివరకు మాట నిలి పారు . . నా తప్పు . . ." మాట పూర్తిచెయ్యలేక పోయింది.

చలపతి ముందుకు కదిలిరాలేదు. కాని అతనిలో వెనకటి నిర్లిప్తతగాని కోపంగాని లేవు. ". . . అంతా విన్నాను పార్వతీ! ... నిర్దోషివి. నా అమూల్యమయిన ఆభరణం నాకు దక్కింది. . . కాని ఎంత అపార్థం చేసుకున్నావు! నోరు తెరిచి నిజంచెబితే ఇంత అనర్థం జరిగేదికాదుగదా!"

పార్వతి విషాదంగా నవ్వింది. "ఏమని చెప్పేది? . . . . . .అందా కన్నులకు కానవచ్చినట్లుండేది. . . డబ్బుకూ, డబ్బుఇచ్చే సౌఖ్యాలకు వ్యామోహపడ్డా ననుకున్నాను. . . ఎంత ఆత్మసంఘర్షణ పడ్డాను! . . ." ఆమెగొంతుకు బొంగురుపోయింది.

చలపతి పాపను ఎత్తుకున్నాడు. పార్వతి చంటివాణ్ణి ఎత్తుకున్నది. ఇద్దరూ రోడ్డుముఖం పట్టారు.

"కారు బాబూ. ." తోటమాలి అన్నాడు.

చలపతికి నవ్వు వచ్చింది. "ఈ కారు, బంగళాలు మాకు వద్దు. . . ఈ గుమాస్తాజీవితం చాలు. ఈ పిల్లలు, అనురాగమయి పార్వతి ఉన్నంతకాలం నాకు ఏమీవద్దు" అంటూ బయలుదేరాడు. పదిమైళ్ళు నడవటం కష్టమనిపించలేదు.

గేటుదాటి రోడ్డుమీదకు రాబోతూ,". . . . రమేశం. ." అని ఏమో చెప్పబోయి చలపతి ఆగాడు. నడుస్తున్నదల్లా, ఆగి పార్వతి భర్తముఖంలోకి సూటిగా చూస్తూ "ఆ పీడకల మరిచిపొండి... మీకుమీరే సాటి. . ." అంది.

పక్కున నవ్వాడు చలపతి.

దానికి శ్రుతి కలిపింది పార్వతి. ★

ఎండ్రిన్

మరియు DDT, BHC, COPPER, FUNGICIDE, ENDRIN, MALATHION రెడీ స్టాకునుండి లభించును

స్టాకిస్టులు కావలెను

వివరములకు:

RAM MOHAN ENTERPRISES

వీరభద్రపురం, రాజమండ్రి. | ఏలూరు రోడ్, విజయవాడ-2. | స్టాల్ నెం. 11, ఫతేమైదాన్ హైదరాబాద్.




ARAVIND LABORATORIES, P.B. 1415, MADRAS-17.